


# THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

## 8

"**ఎలాగూ ఇవాళ ఆఫీసుకి వెళ్ళటంలేదు.** వెళ్ళినా అక్కడ పనిచేయలేను. సరుకులు తీసుకురావాలిగా. సూపర్ బజార్‌కి వెళ్ళొద్దామా?" అడిగింది మైత్రి శ్యామలాంబని మధ్యాహ్నం మూడున్నరకి.

"అలాగే. నెయ్యి అయిపోయింది రాత్రికే లేదు" చెప్పింది శ్యామలాంబ.

పావుగంటలో ఇద్దరూ బయటకి నడిచారు. సూపర్ బజార్‌లోని తోపుడు బండిని తీసుకుని, రకరకాల వస్తువులు అమర్చిన రేక్‌ల మధ్య దాన్ని తోస్తూ, కావలసిన సరుకులని అందులో వేయసాగింది మైత్రి. ఆమె వెనకే నడుస్తోంది శ్యామలాంబ.

ఓ చోట తోపుడు బండిని ఆపి శ్యామలాంబ ఇంటికి కావలసిన వస్తువుల జాబితాని హేండ్‌బేగ్ లోంచి బయటికి తీసింది. ఆ జాబితాని చదివి చెప్పింది మైత్రితో నవ్వి.

"అసలుదే మర్చిపోయామమ్మా. నెయ్యి తీసుకోలేదు"

"మీరు కేష్ కౌంటర్ దగ్గర ఉండండి నేను తీసుకువస్తాను. మళ్ళీ అంతదూరం ఏం వస్తారు?" చెప్పింది మైత్రి.

మైత్రి ట్రాలీని రేక్స్ మధ్య పోనిస్తూ నూనె, నెయ్యిలున్న సెక్షన్ వైపు వెళ్ళసాగింది. మలుపు తిప్పుతూండగా మైత్రి ట్రాలీ మరో వ్యక్తి తోసుకువస్తున్న ట్రాలీకి తగిలి ఆగిపోయింది.

మైత్రి ఆ ట్రాలీ తాలూకు మనిషివంక చూసి చెప్పింది వెంటనే.

"ఐయామ్ సోసారీ"

"నాదే తప్పు. ఇట్సాల్ రైట్" చెప్పింది అవతలి వ్యక్తి.

మైత్రి తన ట్రాలీని అడ్డుతీసాక ఆమె మైత్రిని దాటి వెళుతూ చెప్పింది.

"రాంగ్ రూట్‌లో వచ్చినట్లున్నాను. సారీ"

"ఇట్స్ ఓ.కే. ఎవరికీ ఏం కాలేదుగా" చెప్పింది మైత్రి చిరునవ్వు నవ్వి.

ఆమె తన ట్రాలీతో ముందుకు వెళ్ళిపోయింది. మధ్యలో ఓసారి వెనక్కి తిరిగి చూసిందామె. కాని మైత్రి మలుపు తిరగడంతో ఆమెకి మైత్రి కనబడలేదు.

చిన్నగా నవ్వుకుందామె.

ఆమె పేరు అనసూయ.

బెనర్జీ భార్య.

అంతదాకా ఆ ఇద్దరికీ ముఖపరిచయం కూడా లేదు. వాళ్ళిద్దరి పరిచయం మొదటిసారిగా అలా జరిగింది.

●●●

ఆఫీసులో పనిచేస్తున్న మైత్రికి కబురు వచ్చింది. యం.డి. పిలుస్తున్నారని.

మైత్రి బెనర్జీ గదిలోకి వెళ్ళింది.

"కూర్చో నీవు అబార్షన్ చేసుకోకుండా నాకు ఎంతో మేలుచేసావు. నాకంటూ ఓ వారసుడున్నాడు" నవ్వుతూ చెప్పాడు.

లేచి ఆమె దగ్గరకి వెళ్ళి చనువుగా భుజం మీద చేతిని వేసాడు.

"ఇంకోసారి నన్ను ముట్టుకుంటే సుధీర్‌తో నేను ఎక్కడినుంచి వచ్చానో అక్కడికి వెళ్ళిపోతాను. చెయ్యి తియ్యి" చెప్పింది మైత్రి తీవ్రంగా.

బెనర్జీ తన చేతిని తీసాడు.

"ఈ సంగతి ఇంకోసారి గుర్తుచేసే అవకాశం రానీకు. నేను చెప్పింది చేసే పట్టుదల మనిషి" చెప్పింది మైత్రి.

నవ్వుతూ సిగరెట్ పొగని విలాసంగా ఆమె మొహం మీద ఊదాడు.

"ముందర మీరా సిగరెట్ ఆర్పండి"

"ఆడవాళ్ళందరూ తమ భర్తలు సిగరెట్ తాగకూడదానుకుంటారు ఎందుకో తెలుసా? తమ భర్త చేతుల్లో తనకన్నా సిగరెట్టే ఎక్కువ కాలక్షేపం చేస్తూండబట్టి అనే అసూయతో. అవునా?"

మరోసారి పెదవులు విడివడకుండా నవ్వి చెప్పింది మైత్రి.

"మీకు ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం చేతకాదని మరోసారి నిరూపించారు. తక్కువ కాలంలో కాలి బూడిదయే ఆ సిగరెట్‌లా తమ భర్తలు కూడా అనకూడదని"

కొద్ది క్షణాల తర్వాత చెప్పాడు బెనర్జీ.

"ఎందుకో డాక్టర్ దేవ్ సేన్ ఫెర్టిలిటీ టెస్ట్ చేసాక మందు, సిగరెట్ అధికం అయ్యాయి నాకు. జీవితంలో అదో పెద్ద తీరనిలోటు"

"వీటి స్నేహంతో ఆ లోటుని తాత్కాలికంగా మర్చిపోగల నట్టుగా కనబడేది మీలాంటి డబ్బున్న వాళ్ళకే. మీకు మనిషిమీదకన్నా ప్రేమ డబ్బు మీద ఎక్కువ. ఇంత కష్టపడి సంపాదించిన ఈ ధనం నా తర్వాత నా వాళ్ళు కాని ఎవరికో ఇవ్వాలన్న బెంగతోనే సగం కృంగి కృశిస్తారు. అదే మధ్య తరగతి వాళ్ళయితే హేండ్ - టు - మౌత్ - లివింగ్ కాబట్టి ఆ విషయంలో ఇంత బాధుండదు."

"ఈ ఎనిమిదేళ్ళలో ఎంత ఎదిగిపోయావు. అప్పట్లో ఎంత అమాయకత్వంగా ఉండేదానివో"

"దేనికి పిలిచావు ?" అడిగింది మైత్రి.

"ఇవాళ సాయంత్రం మీ ఇంటికి వస్తున్నాను. సుధీర్‌ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి రక్తపరీక్ష చేయిస్తాను. అతను నాకు పుట్టాడో లేదో తెలుస్తుంది. ఓ.కె?"

"వెరీమచ్ ఓ.కే. నీకలాంటి అనుమానాలు ఉండకూడదు" చెప్పింది

బెనర్జీ నిండుగా కప్పుకున్న ఆమె పైట కొంగుని అందుకుని తీసాడు.

"ఇది ఆఖరి వార్నింగ్. ఇంకోసారి ఇలా చేస్తే షుధీర్ నీకు శాశ్వతంగా దూరం అవుతాడు" చెప్పింది మైత్రి. బెనర్జీ పైటని మళ్ళీ యథాప్రకారం కప్పేసాడు. ఆమె బయటకి వెళ్ళిపోయింది.

●●●

"మనం 'వాంటెడ్ కాలం'లో ఇచ్చిన ప్రకటనకి బదులుగా అమృత ఫుడ్ ప్రోడక్ట్స్ నుంచి టెక్నికల్ మేనేజర్ ఉద్యోగానికి అప్లయిచేస్తూ అప్లికేషన్ పంపాడు" చెప్పాడు విశ్వం డ్రింక్ గ్లాసులో పోస్తూ.

"గుడ్! చేప వల్లో పడిందన్నమాట. ఇంటర్వ్యూకి పిలువు ఇక్కడకాదు మద్రాస్‌లో. టు అండ్ ఫ్రో ఫ్లైట్ టికెట్ ప్లస్ త్రీస్టార్ హోటల్లో ఓ రోజు స్టేకి ఖర్చు మనదే అని తెలియచెయ్యి."

"ఇంటర్వ్యూ అక్కడ దేనికి?"

"తీరిక కోసం" నవ్వాడు బెనర్జీ.

విశ్వం అందించిన గ్లాసులోని విస్కీని ఓ గుక్క తాగి చెప్పాడు.

"చూస్తుంటే ముందు ముందు అన్నీ మంచి రోజుల్లానే ఉన్నాయి"

విశ్వం గ్లాసునెత్తి చెప్పాడు.

"టూ ఆల్ గుడ్ డేస్ దటార్ ఎ హెడ్"

●●●

సాయంత్రం బెనర్జీ ఫేక్టరీ నుంచి సరాసరి మైత్రి ఇంటికి బయలుదేరాడు. మైత్రి అతనికోసం ఎదురు చూస్తోంది.

"హాస్పిటల్‌కేగా?" అడిగింది ఫార్మాలిటీస్‌తో మాటలు వృధాచేయకుండా.

తల ఊపాడు.

అతనితో పాటు సుధీర్‌తో కిందికి దిగివచ్చి కారులో ముందు సీట్లో కూర్చుంది.

బెనర్జీకి సుధీర్‌ని పరిచయం చేసింది.

"బెనర్జీ అంకుల్‌కి నమస్తే చెప్పు"

సుధీర్ అతని వంక బెరుకుగా చూస్తూ రెండు చేతులూ జోడించి నమస్తే చెప్పాడు.

బదులుగా బెనర్జీ సుధీర్ తలమీద చిన్నగా తట్టాడు.

"ఎక్కడికి మమ్మీ?" అడిగాడు సుధీర్.

"డాక్టర్ దగ్గరకి."

"నీ పేరేమిటి?" అడిగాడు  బెనర్జీ సుధీర్ పేరు తెలిసినా.

"సుధీర్" జవాబు చెప్పాడు సుధీర్.

"గుడ్ నేమ్! ఏం చదువుతున్నావు?"

చెప్పాడు.

"ఇంతకాలం ఎక్కడున్నావు?"

"బాంబేలో"

"అక్కడ ఏ స్కూలులో చదివావు?"

జవాబు చెప్పాడు.

"మా ఇంటికి వస్తావా?"

"మమ్మీ పంపిస్తే వస్తాను."

"మమ్మీ వెళ్ళమంటేనే"

"వస్తాను"

"అగైన్ ఎ గుడ్ బాయ్! నీకు చాక్‌లెట్స్ ఇష్టమా లేక ఐస్ క్రీమా?"

"చాక్‌లెట్ ఫ్లేవర్ ఐస్ క్రీమ్"

చిన్నగా నవ్వాడు బెనర్జీ. కారు స్లో చేసి ఓ ఫాస్ట్ ఫుడ్ కార్నర్ ముందు 'నో పార్కింగ్ ' బోర్డ్ ముందు ఆపాడు. వెంటనే మైత్రి ఆ బొమ్మ చూపించింది.

"ఇక్కడాపకూడదు"

"ఇక్కడాపడమే నా స్వభావం. అలాంటి స్వభావం లేకపోతే సుధీర్ ఉండేవాడేకాదు కదూ?"

లోపలికి వెళ్ళి నిముషంలో ఐస్ క్రీం కోన్‌తో తిరిగి వచ్చాడు. పేపర్ నేప్‌కిన్ చుట్టిన దాన్ని సుధీర్‌కి ఇచ్చి చెప్పాడు.

"దిసీజ్ మై ఫస్ట్ గిఫ్ట్"

సుధీర్ వెంటనే తీసుకోనా అన్నట్లుగా మైత్రి వంక చూసాడు.

ఆమె తల ఊపగానే అందుకుని "థాంక్ యూ అంకుల్" అని బెనర్జీతో చెప్పాడు.

"యు ఆర్ వెలకమ్ మైబాయ్" చెప్పాడు బెనర్జీ ఆనందంగా.

"కారులో పడకుండా తిను కార్పెట్ పాడవుతుంది" హెచ్చరించింది మైత్రి సుధీర్‌ని.

"ఇట్సాల్ రైట్" చెప్పాడు బెనర్జీ

"నాకు ఆల్‌రైట్ కాదు" చెప్పింది మైత్రి.

కారు డాక్టర్ దేవ్ సేన్ హాస్పిటల్ ముంది ఆగింది. ముగ్గురూ కారు దిగారు. బెనర్జీ సుధీర్ చేతిని పట్టుకున్నాడు. సుధీర్ రెండో చేత్తో మైత్రి చేతిని పట్టుకున్నాడు. ముగ్గురూ లోపలికి నడుస్తూండగా చెప్పాడు సుధీర్.

"అంకుల్! నా చెయ్యి వదలండి. ఐస్ క్రీం."

"ఫర్వాలేదు" చెప్పాడు బెనర్జీ.

సుధీర్‌ని లోపలికి తీసుకెళ్ళింది నర్స్.

"మీరు రండి" చెప్పింది మైత్రి లేస్తూ.

"వద్దు. కావాలంటే నువ్వెళ్ళు. రక్తం తీస్తున్నప్పుడు ఏడిస్తే నేను చూడలేను" చెప్పాడు బెనర్జీ.

"కొడుకు మీద అదంతా ప్రేమే?" అడిగింది మైత్రి.

"ఉండకూడదా?"

మైత్రి బదులు చెప్పలేదు.

"ఈ ఏడేళ్ళుగా నేను చూపించాల్సిన ప్రేమ ఒక్కసారిగా బయటకి రావడం సహజం" చెప్పాడు బెనర్జీ.

మైత్రి సుధీర్‌ని తీసుకెళ్ళిన గదిలోకి వెళ్ళింది రెండు నిమిషాల తర్వాత చేత్తో దూదిని జబ్బ మీద రాసుకుంటూ బయటకి వచ్చాడు సుధీర్. నర్స్ బెనర్జీని లోపలికి రమ్మని సైగ చేసింది. అతని రక్తం తీసుకున్నాక బెనర్జీ కూడా బయటకి వచ్చాడు.

"రేపు సాయంత్రం తెలుస్తుంది" చెప్పాడు బెనర్జీ మైత్రికి.

"రేపు సాయంత్రం మీకు ఆ సంగతి రూఢి అయాక నేకోరేది తీరిస్తేనే సుధీర్ మీ వశం అవుతాడు, లేదా..." ఆపేసింది ఆ వాక్యాన్ని.

"ఏం కావాలి నీకు? డబ్బు వద్దంటావు. భార్యగా స్థానం వద్దంటావు. ఇంకేం కావాలి?" అడిగాడు బెనర్జీ అసహనంగా

"తీసుకోవడానికి నాకు చాలా తేలికైంది. కానీ ఇవ్వడానికి మీకు ఎంతో ఎంతో కష్టమైంది. అదేమిటో బ్లడ్ రిపోర్ట్ వచ్చి మీ అనుమానం తీరాక విందురుగాని!" చెప్పింది మైత్రి చిన్నగా నవ్వి.

●●●

ఆ రోజు ఉదయం అయిదున్నరకి కాలింగ్ బెల్ మోగడంతో మెలుకువ వచ్చిన మైత్రి తన గది తలుపు తెరచి ముందు గదిలోకి వచ్చి మెయిన్ డోర్ తెరిచింది. ఎదురుగా శ్యామలాంబ కూతురు, అల్లుడు, ఇద్దరు పిల్లలు నిలబడి ఉన్నారు.

"ఎవరు?" అడిగింది మైత్రి.

"మీరెవరు?" అడిగింది శ్యామలాంబ కూతురు.

"శ్యామలాంబగారి పేయింగ్ గెస్ట్ని. మీరు..?"

"కూతురు, అల్లుడు వచ్చాం" చెప్పాడు అల్లుడు నేలమీద ఉన్న సూట్ కేస్ని అందుకుని లోపలికి వస్తూ.

శ్యామలాంబ తమ గది తలుపు తెరచుకుని హాల్లోకి రాగానే చెప్పాడు అల్లుడు చిరునవ్వుతో.

"మీకు సర్ప్రయిజ్ ఇద్దామని ముందు చెప్పకుండా వచ్చేసాం"

"రండి! అమ్మాయ్ పిల్లలు కులాసానా?" ఆవిడ సంవత్సరంన్నర బాబుని ఎత్తుకుంది.

మైత్రి మళ్ళీ తనగదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది, కానీ హాల్లోంచి వినబడే మాటలతో నిద్రపట్టలేదు. అయిదు నిమిషాలు కూడా నిద్రపోకుండానే ఆరుంపావుకి అలారం మోగింది. లేచి సుధీర్ని నిద్రలేపింది.

హాల్లోకి వెళితే ఊతప్పం తింటూ కనబడ్డాడు అల్లుడు.

"మీ అమ్మలా ఊతప్పం చేయడం నేర్చుకోరాదూ! అసలు నిన్ను తీసుకువచ్చింది ఇందుకే" చెపుతున్నాడతను.

బాత్ రూములోంచి బయటికి వచ్చి మళ్ళీ తన గదిలోకి వచ్చిన మైత్రికి శ్యామలాంబ నాలుగున్నరేళ్ళ మనుమరాలు ట్రాన్సిస్టర్ని తిప్పుతూ కనపడ్డది. దాన్ని ఆ పిల్ల చేతిలోంచి లాక్కుని చెప్పింది.

"తప్పు"

వెంటనే "అమ్మా" అని ఏడుపు లంకించుకుందా అమ్మాయి. క్షణంలో శ్యామలాంబ కూతురు ప్రత్యక్షమైంది.

"ఏమైందే?" అడిగింది కూతుర్ని ఎత్తుకుని.

"ఈ ఆంటీ.." అంటూ మైత్రి వంక చూపించింది. ఆమె మైత్రివంక కొరకొరా చూసింది. మైత్రి ఏమీ ఎక్స్ప్లనేషన్ ఇవ్వదలచుకోలేదు. కాబట్టి మాట్లాడలేదు. ఎనిమిదిన్నరకి వంటగదిలోకి వెళ్ళిన మైత్రికి శ్యామలాంబ వంట చేస్తూ, ప్రక్కన నిలబడి డైరెక్షన్స్ ఇస్తూ ఆమె కూతురు కనబడ్డారు.

"మా వారికి ధనియం వాసనే పడదు. తిరగమాతలో పొరబాటున వాడతావేమో, పోపుల పెట్టెలోంచి ఆ డబ్బా తీసేయమ్మా. అరటికాయకూర ఆవపెడితేకానీ తినరు."

తన కూతురికి శ్యామలాంబ మైత్రిని పరిచయం చేసింది.

"ఈమె మైత్రి అని, పేయింగ్ గెస్ట్గా ఉంటోంది. అమ్మాయి నా కూతురు. పేరు సుచరిత"

"నమస్తే" చెప్పింది మైత్రి.

"నమస్తే. పేయింగ్ గెస్ట్లెందుకమ్మా? ఆ గది ఖాళీగా ఉంటే చుట్టాలొచ్చినప్పుడు ఉంటారుగా" చెప్పింది సుచరిత.

"మనిషి తోడుకోసం నన్ను తీసుకున్నారే కానీ పేయింగ్ గెస్ట్ కాదు" జవాబు చెప్పింది మైత్రి.

"కింద మొక్కలనీ ఈ అమ్మాయి పాతినవే" చెప్పింది శ్యామలాంబ.

"మొక్కలతోపాటు దోమలు" నిరసనగా చెప్పింది సుచరిత.

"అంతేకాదు, మొక్కలతోపాటు పళ్ళు, కూరలు" చెప్పాడు సుచరిత తండ్రి చిన్నగా నవ్వి.

తొమ్మిదింపావుకల్లా మైత్రికి సుచరిత వైఖరి అర్థం అయింది. తను ఆ ఇంటికి గెస్ట్‌గా వచ్చానన్న సంగతి ఉండాల్సిన దానికన్నా ఎక్కువ గుర్తుంచుకుంటుంది ఆమె. అంతేకాదు. గెస్ట్‌లకి మామూలు వాళ్ళకన్నా ఎక్కువ అధికారాలున్నాయన్న భావన ఆ భార్యాభర్తలిద్దరకీ ఉంది. పిల్లలు రేడియో తిప్పినా, టి.వి. మీంచి దూకే ఆట ఆడినా సుచరిత ఏం పట్టించుకోదు. పిల్లలు కాబట్టి వాళ్ళలా ఆడటం ఎంతో మామూలు పృథ్విలో అది సహజం అన్నట్లుగా వాళ్ళనసలు పట్టించుకోదు, అదిలించదు. తల్లి తనతో కూర్చుని ముచ్చట్లాడాలనుకుంటుంది.

"మా ఆఫీసు పనిమీద వచ్చాం. ఇవాళ తప్పితే రేపటికి అవుతుంది. రేపు సాయంత్రం వెళదాం అనుకుంటున్నాం" అల్లుడు మామగారికి చెప్పాడు.

శ్యామలాంబకి కూతురితో కూర్చుని మాట్లాడుతున్నా పిల్లలు ఎక్కడ ఏం చేస్తున్నారో అన్న గుబులు గుండెల్లో ఓ మూల ఉండనే ఉందని గ్రహించింది మైత్రి.

పెద్దపిల్ల తన గదిలోకి వచ్చి మనీ ప్లాంట్‌ని తెంపినా, కర్టెన్‌ని పట్టుకుని వేలాడి కర్టెన్ రాడ్‌ని ఊడగొట్టినా మైత్రి మాత్రం ఊర్కోలేదు. ఆ పిల్ల ఏడ్చినాసరే బయటికి నెట్టి సుచరితతో చెప్పింది.

"మీ అమ్మాయి తెంపిన మనీప్లాంట్ పెరగడానికి కనీసం రెండు నెలలు పడుతుంది. చిన్నప్పుడు మా అబ్బాయి ఇదే వయసులో ఇలా చేస్తే మళ్ళీ ఇంకోసారి చేయకుండా గుర్తుండేలా కొట్టాను. క్రమశిక్షణ అనేది ఈ వయసులోనే అలవాడాలి."

సుచరిత మొహం ముడుచుకుంది.

●●●

మర్నాడు సాయంత్రం సుధీర్ బ్లడ్ రిపోర్ట్ వచ్చేదాకా ఎంతో టెన్షన్‌గా ఉంది బెనర్జీకి. మైత్రి చెప్పింది అబద్దం అయితే డాక్టర్ సుధీర్ తన కొడుకయ్యే అవకాశం లేదంటాడు. అలా జరిగితే..? తనకో కొడుకున్నాడన్న సంతోషాన్ని తన జీవితకాలంలో అతి తక్కువ సమయం అనుభవించినవాడవుతాడు. కాసేపయినా ఆ సంతోషాన్నిచ్చినందుకు తను మైత్రికి కృతజ్ఞతగా ఉండాలా లేక ఆశ చూపి అడియాశ చేసినందుకు ద్వేషించాలా?

ఒకవేళ సుధీర్ తన కొడుకే అన్న సంగతి ఋజువైతే, అయితే ఏం చెయ్యాలో అప్పటికే పదిసార్లు అనుకున్నాడు బెనర్జీ. సుధీర్‌ని జంటనగరాల్లోని అతి ఖరీదైన పబ్లిక్ స్కూల్‌లో చేర్పించాలి పాతిక డజన్ల డ్రస్‌లు కుట్టించాలి. ఆఫీస్‌కి వెళ్ళకుండా సుధీర్‌తో ఓ పది రోజులు ఏ కాశ్మీరో, ఊటీనో వెళ్ళి అతనితో గడపాలి. తండ్రిగా తనంటే ఆ కుర్రాడికి ప్రేమకలిగేలా చేయాలి.

సుధీర్‌కి ఏ కళలో అభిరుచి ఉంటే దాంట్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. మ్యూజిక్, పెయింటింగ్, యాక్టింగ్.. ఏదయినా సరే తన పక్క గదిని సుధీర్ కివ్వాలి. ఇంటీరియర్ డెకరేటర్స్‌తో చెప్పి ఆ వయసు పిల్లవాళ్ళ గది ఎలా ఉంటే బావుంటుందో ఆ విధంగా డెకరేట్ చేయించాలి. ఈ లోకంలో తండ్రికి దూరంగా ఇంతకాలం లేమిలో బ్రతికాడు. తను దగ్గరయ్యాక ఏ విషయంలో లోపం చేయకపోతే తండ్రి అంటే విలువ ఏమిటో తెలుస్తుంది.

తన తండ్రి తలకొరివి తను పెట్టాడు. తన తలకొరివి పరాయివాళ్ళు కాక సుధీరే పెడతాడు. నమ్మకం లేకపోయినా అది తన మంచికే నిజంగా పున్నామనరకం అంటూ ఒకటుందేమో? లేకపోతే అసలామాటే ఎందుకొస్తుంది?

తనలా అవకూడదు. సుధీర్‌ని సిగరెట్, ఆల్కహాల్‌కి దూరంగా ఉంచాలి. ఆ కుర్రాడి ముందు తను సిగరెట్ కానీ, మందుకానీ తాక్కూడదు. క్రమశిక్షణలో పెంచాలి. అనసూయకి సుధీర్‌కి పడకపోతే అతని బాగోగులు చూసుకోడానికి ఓ ట్రయిన్డ్ నర్స్‌ని ఆయాగా నియమించాలి.

బెనర్జీ ఆలోచనలు పూర్తిగా సుధీర్ చుట్టూ తన కొడుకుగా అతని భవిష్యత్తు చుట్టూ తిరుగుతున్నాయి. కానీ మరే విషయం మీద మనసు లగ్నం కావటంలేదు.

ఫేక్టరీలో యూనియన్ పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తనకి నమ్మకంగా తెలిసిందని విశ్వం చెపితే ఎప్పటిలా బెనర్జీ అదిరిపడి, అది ఏర్పాటు కాకుండా ఉండటానికి తగిన ఫలితాల గురించి యోచన చేయలేదు.

"అలాగా? ఆ విషయం తర్వాత మాట్లాడుదాం" అన్నాడు.

విశ్వానికి ఆశ్చర్యం వేసింది మిత్రుడి ప్రవర్తన.

"రెండు, మూడు రోజులనుంచి నీలో ఏదో మార్పు వచ్చింది. ఏమిటంత పరధ్యానంగా, డ్రీమ్‌గా ఉన్నావు?" అడిగాడు విశ్వం.

"ఏం లేదు" జవాబు చెప్పాడు బెనర్జీ.

"ఏం లేదంటే నమ్మను. నాకు చెప్పాలని లేదను."

"పోనీ అలాగే అనుకో"

సాయంత్రం మూడున్నరకి డాక్టర్ దేవసేన్ వచ్చాడు.

"నా అనుమానం మైత్రి నీ మనసు పాడుచేసింది. ఓ పట్టాన లొంగడం లేదా? నా సహాయం అవసరం వస్తే అడుగు"

"ఫార్మాలిటీస్ తర్వాత యస్ ఆర్. నో చెప్పు" అడిగాడు బెనర్జీ.

బదులుగా దేవసేన్ తన చేతిని చాపి, బెనర్జీ చేతిని అందుకుని కరచాలనం చేసాడు చిరునవ్వు నవ్వుతూ.

"సుధీర్ నీ కొడుకు. బ్లడ్ టెస్ట్ ఆ విషయాన్ని ఋజువు చేసింది."

వెంటనే బెనర్జీ మొహం ఆనందంతో విప్పారింది. నిశ్శబ్దంగా నవ్వుతూండిపోయాడు బెనర్జీ సంతోషంతో. దేవసేన్ ఆప్యాయంగా అతని భుజాన్ని తట్టి చెప్పాడు.

"కంగ్రాచ్యులేషన్స్"

"ఐయామ్ సో గ్లాడ్" చెప్పాడు బెనర్జీ.

రిపోర్ట్ ఉన్న కాగితాల కవరుని అందించి చెప్పాడు డాక్టర్ దేవ్ సేన్.

"ఒన్స్ అగైన్ కంగ్రాట్స్. ఈ సందర్భంలో ఒకసారి కంగ్రాట్స్ చెపితే చాలదు సో, మళ్ళీ చెపుతున్నాను. వేలకొద్దీ"

"అయితే వేలకొద్దీ థాంక్స్" నవ్వాడు బెనర్జీ ఆనందంగా.

ఆ కవరుని తెరచి అందులోని కాగితాలని చూసి వాటిని మళ్ళీ కవర్లో ఉంచి భద్రంగా కోటు జేబులో పెట్టుకుని చెప్పాడు.

"ఈ విషయం నువ్వు ఎవ్వరికీ తెలియనీకూడదు రహస్యంగా ఉంచాలి"

"అది నా వృత్తి ధర్మం. అలాగే"

"నా విల్లు రాయించాలి. అందులో సుధీర్ నా స్వంతకొడుకన్న విషయం రాస్తాను. అది బేంక్ లాకర్‌లోంచి తీసి నే పోయాక చదివాకే అందరికీ ఇవాళ నువ్వు నిర్ధారణ చేసిన విషయం తెలుస్తుంది. అంత దాకా నీకూ, నాకూ, మైత్రికి, లాయర్‌కి తప్ప మరెవరికీ తెలీదు"

"ఈ రహస్యం నా వైపు నుంచి బయటపడదు. నువ్వు నిశ్చింతగా ఉండచ్చు. ఈ సంగతి తెలిస్తే మొట్టమొదటగా బాధపడేది మీ భార్య. ఐకెన్ అండర్ స్టాండ్ హర్ ఫీలింగ్స్" చెప్పాడు దేవ్ సేన్.

"థాంక్ యూ."

అతనితో కరచాలనం చేసి బెనర్జీ బయటకి నడిచాడు. అతనికి గాల్లో తేలిపోతున్న అనుభూతి. అలాంటి సంతోషకరమయిన మానసిక స్థితి ఎన్నడూ అనుభవించలేదతను.

కారు డ్రయివ్ చేస్తూ ఆ విషయమే ఆలోచించాడు. ***అవసరం అయింది ఏది సమయానికి దొరికినా అది అపురూపంగా అనిపించదు. అది సాధారణ విషయం అయిపోతుంది. కానీ ఇక దొరకదు అనుకున్నది. దాని అవసరం బాగా ఫీలవుతున్నప్పుడు దొరికితే అది ఎంత దృుతంగా ఉంటుందో అనుభవించేవాడికే తెలియాలి.***

బెనర్జీ తన కారుని సరాసరి మైత్రి ఇంటికి పోనిచ్చాడు.

శ్యామలాంబ తలుపు తెరిచింది.

"మైత్రి కోసం వచ్చాను" చెప్పాడు బెనర్జీ.

"అమ్మాయ్ బయటకి వెళ్ళింది. రేపు ఉదయం కలుస్తానని చెప్పమంది."

"ఎక్కడికి వెళ్ళింది?" నిరుత్సాహంగా చూస్తూ అడిగాడు బెనర్జీ.

"ఫ్రండింటికిట. రాత్రికి రానంది"

"సుధీర్....?"

"ఇద్దరూ కలిసే వెళ్ళారు"

"ఆ ఫ్రండ్ ఇల్లు ఎక్కడో తెలుసా?"

"తెలీదు?"

బెనర్జీ చేసేదిలేక వెనక్కి తిరిగాడు. తనకున్న ఆత్రం మైత్రికి ఉండాల్సిన అవసరం లేదుగా అనుకున్నాడు.

●●●

మర్నాడు ఉదయం బెనర్జీ ఆఫీసుకి వెళ్ళగానే ప్యూన్‌ని పిలిచి మైత్రిని అర్జంటుగా రమ్మంటున్నానని చెప్పి, వెంటబెట్టి తీసుకురమ్మన్నాడు.

ఆ సమయంలో మైత్రి తన తోటి ఉద్యోగస్తులని అడుగుతోంది. "మీరెవరూ మన ఫేక్టరీలోని బాత్ రూంలని ఉపయోగించరా?"

"ఎందుకు అలా అడిగావ్?" మరో అమ్మాయి ప్రశ్నించింది.

"అవి మనుషులు ఉపయోగించే బాత్ రూంలలా ఉన్నాయా? వాసన. శుభ్రత, నీళ్ళులేని బాత్ రూంలవి" చెప్పింది మైత్రి.

"మేం చేరినప్పటినుంచి అవి అలాగే ఉన్నాయి" చెప్పింది మొదటి అమ్మాయి.

"ఇలా మాట్లాడితే నీ ఉద్యోగం ఊడుతుంది. ఇవాళ బాత్ రూంల గురించి చెప్పావ్. నిన్న 'కేంటిన్ లోని ఏ పదార్థం బావుండదు కదా ఎలా తింటున్నారంటావ్' రేపు ఇంకోటేదో అంటావ్. ఈ విషయాలు మాలు తెలియకనా? చూసీ చూడనట్లు పోవాలి. లేకపోతే ఈ కండిషన్స్‌లో చేరటానికి మన ప్రతి పోస్ట్‌కి వెయ్యిమంది పైగా అభ్యర్థులున్నప్పుడు మేనేజ్‌మెంట్ ఇలాంటివి ఎందుకు పట్టించుకుంది? కంపెనీకి లాభం లేని ఏ ఖర్చు చేయడానికి ఇష్టపడదు"

"ఇందులో లాభనష్టాల ప్రసక్తిలేదు. మనిషిని సాటి మనిషిగా ట్రీట్ చేయాల్సిన కనీస బాధ్యత ప్రతి మనిషి మీద ఉంది. మేనేజింగ్ డైరెక్టర్ టైల్డ్ బాత్ రూం ఖరీదు, మనకోసం కేటాయించిన అన్ని బాత్ రూంల ఖరీదు, కన్నా ఎక్కువ. ఆయనకోసం

అందులో రూమ్ ఫ్రెషనర్స్ వాడితే మన బాత్ రూంలలో కనీసం కలరా ఉండలు కూడా ఉంచరు. అవసరం కాబట్టి కంప్యూటర్ సెక్షన్ ఏ.సి. చేసారు. అదీ మనుషులకోసం కాదు. యంత్రాల కోసం. మన ఏస్ బెస్టాస్ షెడ్‌లలో ఎండాకాలం నల్లుల్లా మాడిపోతున్నాం. మనకీ కొన్ని సౌకర్యాలుండాలి వాటికోసం పోరాడి తీరాలి" ఆవేశంగా చెప్పింది మైత్రి.

"అంటే యూనియన్ పెడదామనా నీ ఉద్దేశం" అడిగారు ఒకరు ఆశ్చర్యంగా.

"అలా పోరాడే వ్యవస్థకి ఆ పేరే అంతా పెడితే, మనమూ అదే పేరు పెడదాం"

"ఇదివరకోసారి ఇలాగే యూనియన్ పెడదామని ప్రయత్నించినతన్ని ఉద్యోగంలోంచి తీసేసారు తెలుసా!"

"తెలుసు. ఒకర్నికాదు. అనేకమందిని. కొన్ని ఫేక్టరీలని ఇంత ఛండాలంగా నిర్వహిస్తారని నాకు తెలీదు. లేబర్ కోర్టుని ఏర్పాటు చేసింది మనలాంటి వారికోసమే"

"ఈ విషయం సింహాచలానికో, విశ్వానికో తెలిసిందా నీ ఉద్యోగానికి ఇంతే సంగతులు"

"తుమ్మితే ఊడిపోయే ముక్కుని తుమ్మినా ఊడకుండా చేసుకోగలడమే గొప్పతనం" నవ్వింది మైత్రి.

అంతా మళ్ళీ ఎవరి పన్లలోకి వాళ్ళు వెళ్ళిపోయారు. మైత్రి ఆ విషయాలగురించే ఆలోచించసాగింది. అయిదు నిముషాల్లో బెనర్జీ ప్యూన్ వచ్చి చెప్పాడు.

"మిమ్మల్ని యం.డి.గారు పిలుస్తున్నారు"

ఆ సెక్షన్ లో పనిచేసే ఒక అమ్మాయి 'నే చెపితే విన్నావా?' అన్నట్లుగా చూసింది మైత్రి వంక.

"దేనికి?" అడిగింది మైత్రి.

ప్యూన్ కోపంగా చూసి చెప్పాడు.

"అన్నీ నాతో చెపుతారా? రమ్మన్నారు, రండి. వచ్చి ఎందుకో తెలుసుకోండి"

మైత్రి చేతిలోని పెన్ను కేప్ మూసి దాన్ని డ్రాయర్‌లో ఉంచి అతని వెంట నడిచింది.

✷✷✷

***(ఇంకా ఉంది)***

Post your comments